
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 జనగామ
ఆదివారం 18 ఫిబ్రవరి 2024


పగుళ్లు వచ్చిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు

కాళేశ్వరం కంచికేనా?

ప్రభుత్వ శ్వేతపత్రంతో ప్రాజెక్టు భవితవ్యంపై నీలినీడలు

"కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుం టున్నాయి. అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంలో కాళేశ్వరాన్ని ఓ పనికి రాని ప్రాజెక్టుగా ప్రభుత్వం అభివర్ణించింది. కాగ్ నివేదికలోనూ గత ప్రభుత్వం అవసరానికి మించి ఖర్చు చేసిందని పేర్కొంది. వీటన్నింటికి తోడు కుంగిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు సీపేజీలతో లీకేజీలు అవుతున్న అన్నారం బ్యారేజీల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి మర మ్మతులకు నిధుల కొరత ఏర్పడుతోంది. అలాగే 2022 జూలై వరద లకు నీట మునిగిన కన్నెపల్లి పంపుహౌస్‌లో 17మోటర్లకు కేవలం ఆరు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. మిగతా మోటర్ల పరిస్థితేంటి? వీటికి మరమ్మతులు చేసేదెవరు? అనేది చర్చనీయాంశంగా మా రింది. దీంతో అసలు కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన ఈ కట్టడాలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలుగా మాత్రమే పనికి వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి."

- అన్నారం బ్యారేజీ కూడా కుంగిపోనుందా!!
- ఇప్పటికే సీపేజీలతో బ్యారేజీల నుంచి నీళ్లు లీక్
- మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడంతో గేట్లెత్తిన అధికారులు
- వరదలకు మునిగిన కన్నెపల్లి పంపుహౌస్‌లోని 17మోటార్లలో పనిచేసేవి ఆరే..
- ప్రాణహిత-చేవెళ్ల వైపే ప్రభుత్వం మొగ్గు
- కాళేశ్వరం.. పర్యాటక ప్రాంతంగానే మిగిలిపోతుందని అనుమానాలు

వరంగల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ప్రతి ష్టాత్మకంగా నిర్మించింది. 2016 మే 2వ తేదీన అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా.. రూ.84వేల కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును నిర్మించి ప్రారంభించారు. తొలుత రెండు టీఎంసీల చొప్పున 90 రోజుల పాటు ప్రతి ఏటా 180 టీఎంసీల నీటిని గోదావరి నీటిని ఎత్తిపోయా లని లక్ష్యంగా పెట్టుకు న్నారు. 18,25,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించ టంతో పాటు మరో 18,82,970 ఎకరాల ఆయకట్టును స్థిక రించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో భూపాలపల్లి జిల్లా మహదేవ పూర్ మండలం కాళేశ్వరం సమీపంలో మేడిగడ్డ వద్ద గోదావరిపై ఆనకట్ట నిర్మించారు. 16.17టీ ఎంసీల నీరు మేడిగడ్డ వద్ద నిల్వ చేసి కన్నెపల్లి పంప హౌస్‌లో ఏర్పాటు చేసిన 17 మోటర్లతో ఎత్తిపోయాలని నిర్ణయించా రు. 2019 జూన్ 21న ఈ ప్రాజెక్టును అప్పటి సీఎం కేసీఆర్ ప్రజలకు అంకి తం చేయగా.. ఆ సమయం లోనే మూడో టీఎంసీ నీటిని ఎత్తిపోసే పనులకు కూడా శ్రీకారం చుట్టారు. దీంతో అంచనా వ్యయం రూ.1.47లక్షల కోట్లకు పెరిగింది. ఆయక ట్టును కూడా 45లక్షలకు పెం చారు. అయితే 2019 నుంచి 2023 వరకు కేవలం 164టీ ఎంసీల నీటినే ఎత్తిపోశారు. అంతేకాకుండా కేవలం 94 వేల ఎకరాల ఆయకట్టుకు నీరం దించారు. దీంతో పాటు ప్రాజెక్టు కోసం భూములను త్యాగం చేసిన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ రైతులకు చెందిన ఇతర భూములకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎకరం భూమికి కూడా చుక్క నీరందదు. ఉమ్మడి వరం గల్ జిల్లాలోని


నీట మునిగిన కన్నెపల్లి పంపుహౌస్ (ఫైల్)



అన్నారం బ్యారేజీలో బుడుగలు (ఫైల్)

పలు ప్రాంతాలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా కాళేశ్వరం నీళ్లు రైతులకు అందటమే కొంత ఊరట.

మునిగిన పంప్‌హౌస్.. కుంగిన బ్యారేజీలు..

కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైనవి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కన్నెపల్లి, సుందిళ్ల పంపుహౌస్‌లు. అయితే 2022 జూలై 14వ తేదీన వచ్చిన వరదలకు కన్నెపల్లి, సుందిళ్ల పంప హౌస్‌లు నీట మునిగాయి. సుందిళ్ల పంప్‌హౌస్‌కు పెద్దగా నష్టం లేకున్నప్పటికి కన్నెపల్లి పంప్‌హౌస్‌లో భారీ నష్టం వాటిల్లింది. పంపుహౌస్‌లో ఉన్న పెద్ద క్రేన్‌లు విరిగి అందులో ఉన్న 17మోటర్లపై పడిపోయాయి. ఆ ఘటనలో 7మోటర్లు పూర్తిగా దెబ్బతినగా, 4మోట ర్లకు పాక్షింగా నష్టంవాటిల్లింది. అప్పటి నుంచి కన్నెపల్లి పంపుహౌస్‌లోకి ప్రవేశా లను గత ప్రభుత్వం నిషేధించింది. దీంతో లోపల ఏం జరుగుతుందో ఎవరికి తెలి యని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తరువాత వాస్తవ పరిస్థి తులు వెలుగులోకి వస్తున్నాయి. మొత్తం 17 మోటర్లలో కేవలం ఆరు మోటర్లు మాత్రమే పని చేస్తున్నట్టు

మిగతా 6వ పేజీలో..



అన్నారం బ్యారేజీ 10 గేట్ల ఎత్తివేత

- ఫౌండేషన్ టెస్టుల కోసం 7వేల క్యూసెక్కుల నీరు విడుదల
- ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాల మేరకు పరీక్షలు

మహదేవపూర్ / మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 17 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన అన్నారం(సరస్వతీ) బ్యారేజీ నుంచి శనివారం నీటిని విడుదల చేసినట్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో 20వ పిల్లరు కుంగిన నేపథ్యంలో జాతీయ ప్రాజెక్టుల రక్షణ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలనూ పరిశీలించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ ఆఫ్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో డిల్లీకి చెందిన ఫార్సన్ కంపెనీతో ఫౌండేషన్ టెస్టులు చేయించేందుకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో బ్యారేజీలో శనివారం ఉదయం 2.06 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 10గేట్లను 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఒకేసారి పూర్తినీటిని విడుదల చేస్తే దిగువన కాళేశ్వరం, మేడిగడ్డ వద్ద ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో నెమ్మదిగా వదులుతున్నామన్నారు. వచ్చేది వేసవి అయినప్పటికీ తప్పని సరి పరిస్థితుల్లో నీటిని విడుదల చేయాల్సి వస్తోందన్నారు.


వన దేవతల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వనదేవతల దర్శనానికి..

లక్షలాదిగా తరలి వస్తున్న భక్తులు



వనజాతరకు మరికొద్దిరోజులే సమయమున్న నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వనదేవతల దర్శనానికి తరలొస్తున్నారు. ఈ క్రమం లో శనివారం లక్షమందికి పైగా జనం మేడారం వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో కుటుంబ సమేతంగా, బంధుమి త్రులతో కలిసి తల్లుల సన్నిధికి చేరుకుంటున్న భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించి.. సమ్మక్క, సారలమ్మ గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరసారె సమర్పించుకుం టున్నారు. యాట మొక్కులు చెల్లించుకుం టున్నారు. లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించు కున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

- మేడారం

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి : మంత్రి సీతక్క
- మేడారంలో వైద్య అధికారులతో సమీక్ష
- వివిధ శాఖల సేవలకూ శ్రీకారం



వివరాలు 7లో..

పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

- 28 నుంచి ఇంటర్, మార్చి 18 నుంచి టెన్త్ ఎగ్జామ్స్ ప్రారంభం
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 17: జిల్లాలో ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సీ పరీ క్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అధికారు లను ఆదేశించారు. త్వరలో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శని వారం కలెక్టర్ మినీ సమావేశ మంది రంలో ఆయన సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ నెల 28 నుంచి మార్చి 16 వరకు జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ సంవ త్సరంలో 4361 మంది, ద్వితీయ సంవ త్సరంలో 4776 మందితో మొత్తం 9137 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని అన్నారు. అదే విధంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి నిర్వహించనుండగా ఇందుకు గాను 41 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 6698 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రతీ 3 - 4 సెంటర్లకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ దామోదర్‌రెడ్డి, డీఐఈవో భైరి శ్రీనివాస్, డీఈవో కె.రాము, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, డీపీవో రంగా చారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి అన్నాచెల్లెలు మృతి

అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేచిన క్రమంలో ఘటన

వరంగల్ నగరంలో విషాదం


శౌర్యతేజ (ఫైల్)


తేజస్వినీ (ఫైల్)

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 17: మేడారం మహాజాతరకు వెళ్లి సమ్మక్కసారలమ్మలను దర్శించుకోవాలన్న ఆనందం విషాదంగా మారింది. ఇద్దరు బిడ్డలను పోగొట్టుకున్న ఆ దంపతులకు తీరని గుండెకోత మిగిలింది. ఇంటి ఆవర ణలో మూత లేకుండా ఉన్న సంపులో పడి అన్నాచెల్లెలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ విషాద సంఘటన వరంగల్‌లో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం...

వరంగల్‌లోని ఏనుమాముల బాలాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్, రమ దంపతులు 30 ఏళ్లగా మార్కెట్ సమీపంలో టీషాపు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు కాగా పెద్ద కూతురు బాలేశ్వరీని

మిగతా 8వ పేజీలో...

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

- మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున


విన్నర్ జట్టుతో చైర్ పర్సన్ జమున తదితరులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 17: క్రీడలు మానసి క, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని జనగామ మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని జనగామ నియోజక వర్గ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ శనివారం అట్టహాసంగా ముగిసింది. ఈ కార్యక్రమా నికి జమున ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వాలీబాల్ క్రీడా కారులకు టీషర్టులు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ క్రీడల్లో 35 టీములు పాల్గొనగా సుంచనకోట, పెంబర్తి, ఐనాపూర్, రెడ్డినాయక్ తండా టీములు సెమీ ఫైన ల్‌కు చేరుకున్నాయి. ఐనాపూర్ జట్టు విన్నర్‌గా, సుంచనకోట జట్టు రన్నరప్‌గా నిలిచింది. వీరికి ఈ నెల 18న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బహుమతులు పంపిణీ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తాళ్ల సురేష్‌రెడ్డి, నీల రాంమనోహర్, ఎండి.అన్వర్, విజయ్, ప్రవీణ్, సలీమ్, వినోద్, శ్రీనివాస్, జానీ, మహేష్, శివ, నాని తదితరులు పాల్గొన్నారు.

రాళ్లతో కొట్టి.. ఉరి వేసి..

భర్తను హతమార్చిన భార్య

సహకరించిన కుమారుడు, కూతురు, అల్లుడు, బంధువు

వరంగల్ జిల్లా దుగ్గొండిలో ఘటన


ఘటనా స్థలంలో రాజు మృతదేహం


రాజు (ఫైల్)

దుగ్గొండి, ఫిబ్రవరి 17: భర్తను భార్య హతమార్చింది. నిత్యం మద్యం తాగి డబ్బుల కోసం వేధిస్తున్నాడనే ఆగ్రహంతో రాళ్లతో కొట్టి.. ఉరి తీసి చంపింది. కొడుకు, కూతురు, అల్లుడుతోపాటు మరో బంధువుతో కలిసి ఈ దారుణానికి పాల్పడింది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం...

మైసంపల్లి గ్రామానికి చెందిన జేరుపోతుల రాజు(55)కు భార్య లక్ష్మి, కుమారులు ప్రశాంత్, సూర్య, కుమార్తెలు మాధవి, చింటు ఉన్నారు. కుమార్తె లకు పెళ్లి కాగా ఇద్దరు కుమారులు అవివాహితులు. కుటుంబమంతా వ్యవ సాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా రాజు మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం భార్య లక్ష్మిని నిత్యం వేధించేవాడు. ఈ క్రమం లోనే శుక్రవారం సమ్మక్క దేవుడికి ఆ కుటుంబం కొలుపు చేసుకుంది. ఎప్పటి లాగే భార్యతో రాజు అదే రోజు అర్ధరాత్రి డబ్బుల కోసం గొడవపడ్డాడు. దీంతో ఆమె కోపోద్రిక్తురాలైంది. కుమారుడు సూర్య, కుమార్తె మాధవి, అల్లుడు రాకే శ్, బంధువు తరుణ్ సహకారంతో రాజును రాళ్లతో కొట్టి గాయపర్చింది. ఆపై ఐదుగురు కలిసి రాజును ఉరివేసి చంపారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై పరమేశ్ శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు ప్రశాం త్ ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

బామ్మలు బరువవుతున్నారు..

- ఒకప్పుడు సాయంత్రమైందంటే బామ్మలు (బాపమ్మలు) మనవలు, మనవరాళ్లని చంకనెత్తుకొని 'చందమామ రావే.. జాబిల్లి రావే..' అంటూ ఆకాశంలో జాబిల్లిని చూపిస్తూ గోరు ముద్దలు తినిపించేవారు. తర్వాత ఒళ్లో పడుకోబెట్టుకొని జోకొడుతూ చందమామ కథలు చెబుతూ వారిని నిద్రపుచ్చేవారు.
- కొన్నేళ్ల క్రితం అమ్మానాన్నలు మందలిస్తే పిల్లలు నానమ్మతాతల పంచన చేరేవారు. వారిపై ఫిర్యాదు చేసేవారు. అప్పుడు వారు కొడుకుకోడళ్లను సున్నితంగా మందలించేవారు. దీంతో పిల్లలు సంతోషపడే వారు. 'మళ్లీ మా జోలికొస్తే నానమ్మకు చెప్తా' అన్నట్టు చూసేవారు. అది వారికొక ఆనందాన్ని ఇచ్చేది.
- ఇంటికొచ్చే పెద్దలను, అతిథులను ఎలా గౌరవించాలో విడమర్చి చెప్పేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేక అతిథులకు పిల్లలు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోవాలంటే అనేకం ఉన్నాయి. కారణం ఏదైనా నేటి పిల్లల్లో నానమ్మతాతయ్యలు దగ్గర లేని లోటు స్పష్టంగా కనబడుతోంది.

- వృద్ధాశ్రమాల్లోకి నానమ్మ, తాతయ్యలు
- విచ్ఛిన్నమవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ
- రోడ్డున పడుతున్న కుటుంబ గౌరవాలు
- కంచికి చేరిన చందమామ కథలు
- పిల్లల్లో కనిపించని సంప్రదాయాలు

లింగాలఘణపురం, ఫిబ్రవరి17: 'అనగనగా ఒక రాజు.. ఆ రాజుగారికి ఏడుగురు కొడుకులు..' అంటూ చిన్నారులను ఊహాలోకంలో విహరింపజేసే నీతి కథలు కనుమరుగవుతున్నాయి. పెరిగిన సాంకేతికత.. అందు బాటులోకి వచ్చిన ఆధునికతకు తోడు ఫ్యాషన్ పోకడల కారణంగా ఇంట్లో రామకోటి రాసుకుంటూ సేదతీరాల్సిన నానమ్మ, తాతయ్యలు ఇంటికి దూరంగా వృద్ధాశ్రమాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఫలితంగా చిన్నారులకు నీతి కథలు, సూక్తులు విడమర్చి చెప్పే బామ్మల తరం ఇప్పుటి పిల్లలకు లేకుండా పోయింది. బండెడు హోం వర్క్, బట్టీ చదువుల కారణంగా పిల్లలకు ఉపకరించే చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు కథల పుస్తకాలు సైతం ఆదరణకు నోచుకోలేకపోతున్నాయి.

పుస్తకాలతో చిన్నారుల కుస్తీ..

అరుగులపై కూర్చొని పిల్లలందరినీ ఒక్కచోటికి చేర్చి అమ్మమ్మలు, నాన్నమ్మలు చెప్పే అలనాటి కథలు అంత రించిపోతున్నాయి. బామ్మలు చెప్పే జోకులతో నవ్వుల పువ్వులు విరబూసే చిన్నారులు ఇప్పుడు నైతిక వికాసా నికి దూరమై పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. పొద్దంతా పాఠశా లలో, సాయంత్రం ట్యూషన్లలతో బిజీగా గడిపే చిన్నారు లు రాత్రిళ్లు భోజనం చేశాక కాస్త విరామం దొరికితే చా లు సెల్‌ఫోన్లు పట్టుకోవడమో లేక టీవీలకు అతుక్కు పోవడమో జరుగుతోంది తప్ప బుద్ధి, భాష, నైతిక వికా సం పెంపొందించుకునే ధ్యాస కరువైపోతోంది. దీంతో బాల్యం నుంచే చిన్నారులు ఒంటరి జీవితాన్ని అనుభ వించాల్సిన దుస్థితి నేటి తరం పిల్లలకు దాపురిస్తోంది.

జాడలేని ఉమ్మడి కుటుంబాలు..

ప్రస్తుతం చిన్నకుటుంబాలు పెరిగిపోతున్నాయి. ఇరు కు గదుల అపార్ట్‌మెంట్‌లలో జీవిస్తున్నారు. తల్లిదండ్రు లు ఉద్యోగాలు, వ్యాపారాలతో బిజీ జీవితం గడుపుతు న్నారు. దీంతో కొంతమంది అమ్మమ్మ, నానమ్మ, తాత య్యలు పల్లెటూర్లల్లో నివసిస్తుండగా మరికొంత మంది వృద్ధాశ్రమాల్లో చేరుతున్న పరిస్థితులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇక బాబాయ్‌లు, పిన్నీలు, పెద్దమ్మ, పెద్దనాన్నల కుటుంబాలు ఎక్కడెక్కడో స్థిరపడిపోతుం డటంతో ఉమ్మడి కుటుంబాల ఊసేలేకుండా పోతోంది.

రోడ్డున పడుతున్న కుటుంబ గౌరవాలు..


మూడు దశాబ్దాల క్రితం వరకు ఉమ్మడి కుటుంబా లు పల్లె వాతావరణాకి ప్రతీకలుగా నిలుస్తుండేవి.. అన్న, తమ్ముడు.. పెద్దనాన్నా.. బాబాయి.. పెద్దమ్మలు, చిన్నమ్మలు, చిన్నతాత, పెద్దతాతలు ఇలాంటి ఆత్మీయ అనుబంధాలు ఎక్కడ చూసినా కనబడేవి. క్రమశిక్షణకు మారుపేరుగా.. మర్యాదలకు ఆలంబనగా దర్శనమిస్తుం డేవి. ఒకప్పుడు పెద్దవాళ్లు ఎక్కడ కనిపించినా రెండు చేతులెత్తి నమస్కారం చేసే సంస్కృతి ఉండేది. ఇప్పు డు వాడెవడైతే నాకేంటి అనుకునే దౌర్భాగ్య ధోరణికి చేరుకున్నారు పిల్లలు. సంపాదనే లక్ష్యంగా.. ఆస్తులు అంతస్తులే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నేటితరం చిన్నపాటి పట్టింపులతో కుటుంబ బంధాలను తెంచే సుకుంటున్నారు. ఏడాదికోసారి పండుగలకో.. పబ్బాల కో.. పెళ్లిళ్లలోనే కలుసుకున్నప్పుడు కూడా సమీపబం ధువులు, రక్తసంబంధీకులతో ఆత్మీయ పలకరింపులు కరువై.. ఎడమొహం పెడమొహాలతో తప్పిం చుకుపోతున్నారు. అయితే సరిగ్గా ఇలాంటి సందర్భాల్లోనే ఇంట్లో ఉండే పెద్దలు ఇటు వంటి సమస్యలను పరిష్కరించి ఇద్దరి మధ్య దూరా లను తగ్గించి ఆత్మీయ తను అతికించేవారు. కానీ దురదృష్టవశా త్తు ఇప్పుడా పరిస్థితి లేదు. ఇంట్లో ఉండాల్సి న వృద్ధులను వృద్ధాశ్ రణాలయాలకు సాగనం పుతుంటే రక్తసంబంధా లు మృగ్యమైపోతున్నా యి. ఫలితంగా కుటుంబాల్లో ఇన్నాళ్లు నెలకొన్న గౌరవ మర్యాదలు ఇపుడు కనుమరుగవుతున్నాయి.

కారణాలు అనేకం..

పెద్దలు దూరంగా ఉండడానికి కారణాలు అనేకం ఉంటున్నాయి. ఇరుకు ఇళ్లల్లో ఉండలేక కొందరు, ఇరుగుపొరుగు వారితో ముచ్చట్లు కరువై మరికొందరు, పట్నం వాతావరణం పడక మరికొందరు ఉంటే, కొడుకు కోడళ్లతో పొసగక మరింతమంది కుటుంబాలకు దూరం గా ఉంటున్నారు. ఉద్యోగ రీత్యా నేడు కొంతమంది దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడో ఉంటున్నారు. అంతదూరం వెళ్లలేక కొందరు పుట్టిన ఊళ్లకే పరిమితమవుతున్నారు.

అలనాటి సీసీ కెమెరాలు వాళ్లే..

ఇంటి ముందున్న పొడవైన పెద్దపెద్ద అరుగుల మీద పొద్దస్తమానం కూర్చుని కబుర్లు చెప్పుకునే బామ్మల నిఘా వ్యవస్థ మామూలుగా ఉండదనే విషయం నేటి తరానికి తెలియకుండా పోతోంది. వీధుల్లో కూర్చున్నట్టే కూర్చునే బామ్మలు ఓ చెవిని ముచ్చటవైపు మరో చెవిని రెండు కళ్లను వీధుల్లో జరుగుతున్న తతంగాలపై నిఘా పెట్టేవారు. ఎవరు ఎవరితో తిరుగుతున్నారు.. ఎవరెవరితో ఏ రకమైన ముచ్చట్లు పెడుతున్నారో కనిపెట్టి అయినవాళ్ల చెవిలో ఇట్టే వేస్తుండేవారు. దీంతో పిల్లల్లో చెడుప్రవర్తన, విచ్చలవిడి తత్వానికి అడ్డుకట్టలు పడుతుండేవి. దొంగతనాలకు పాల్పడే వాళ్ల కదలికలను గమనిస్తుండేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులను చెప్పే వీలు లేకుండా వృద్ధులను శరణాలయాల్లోకి పంపించడం వల్ల అసలు వీధుల్లో, ఇంట్లో ఏం జరుగుతుందో పసిగట్టి చెప్పే దిక్కులేకుండా పోతోంది. దీంతో ఇళ్లల్లో ఇంటి ముందు సీసీ కెమెరాలను బిగించుకునే పరిస్థితులు దాపురిస్తున్నాయి.



సండే స్పెషల్
SUNDAY SPECIAL

కాళేశ్వరం.. కంచికేనా?

5వ పేజీ తరువాయి

సమాచారం. మిగతా మోటర్లను మరమ్మతులకు నోచుకోకపోవటంతో అందులో ఎన్ని పనికి వస్తాయో అనేది తెలియటం లేదని అధికారులు పేర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో పంప్ హౌస్ వినియోగంలోకి రావాలంటే కనీసం రూ.1200కోట్లు అవసరంగా గతంలో ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ అవస్థల్లో ఉండగానే 2023 అక్టోబరు 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో 20 పిల్లర్ కుంగిపోయింది. దీంతో పాటు 18, 19, 21, 22వ పిల్లర్లకు కూడా పగుళ్లు ఏర్పడినట్లు అధికారులు గుర్తించారు. దీని మరమ్మతుల కోసం సుమారు రూ.450కోట్లు అవసరంగా అధికారులు అంచనా వేశారు. అయితే బ్యారేజీ నిర్మాణంలోనే లోపాలు ఉన్నాయని, డిజైన్ లోపంతో బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై విజిలెన్స్ విచారణలో కూడా మేడిగడ్డ బ్యారేజీ పనికి రాద నే తేల్చి చెప్పింది. దీంతో బ్యారేజీ మొత్తం కూల్చి కట్టాలంటే మళ్లీ రూ.4,500 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీపై ప్రభుత్వం ఎటూ తేల్చలేక పోతోంది. మరోవైపు మరో కీలకమైన అన్నారం బ్యారేజీలోనూ లోపాలు వెలుగులోకి వచ్చాయి. 2023 అక్టోబరు 27న అన్నారం బ్యారేజీలో పలు పిల్లర్ల వద్ద సీపేజ్‌లు కనిపించాయి. దీంతో బ్యారేజీలో నీళ్ల లీకేజీతో పెద్ద పెద్ద బుడుగలు రావటంతో అధికారులు అప్పటికప్పుడు సిమెంట్ బ్యాగుల్లో ఇసుక నింపి సీపేజ్‌లను రాకుండా కట్టడి చేశారు. ఇది కూడా మేడిగడ్డ బ్యారేజీ టెక్నాలజీతోనే నిర్మించారు. ఇటీవల మరోసారి బ్యారేజీలో బుంగలు ఏర్పడంతో ఇంజనీర్లలో ఆందోళన వ్యక్తం అయింది. భూపాలపల్లి జిల్లాలో ఉన్న కీలకమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో పాటు కన్నెపల్లి పంపుహౌస్‌లు ప్రమాదంలో ఉండటం చర్చనీయాంశంగా మారింది.

కాళేశ్వరంపై ప్రభుత్వం వెనుకడుగు..

కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును మొదటి నుంచి వ్యతిరేకిస్తుంది. ప్రాణహిత-చెవేళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం కట్టడం గత ప్రభుత్వం చేసిన తప్పుగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొంటున్నారు. శనివారం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయటం అసాధ్యమని, కనీసం అక్కడ కాఫర్ డ్యామ్ కూడా నిర్మించే పరిస్థితి లేదని మంత్రి ఉత్తమ్ తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసం రూ.38 వేల కోట్లతో ప్రాణహిత- చెవేళ్ల ప్రాజెక్టు పూర్తయ్యేదని, రూ.1.47లక్షల కోట్లకు అంచనాలను పెంచి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీంతో భారీగా అక్రమాలు జరిగినట్లుగా ప్రభుత్వం పేర్కొంటుంది. దీంతో పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో జరిగిన నష్టాన్ని నిర్మాణ సంస్థలే భరించేందుకు ముందుకు రాకపోవటంతో ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై వెనుకడుగు వేస్తుందనే చర్చ జరుగుతోంది. అన్నారం బ్యారేజీలో లీకేజీలు కూడా భవిష్యత్తులో బ్యారేజీకి ప్రమాదాన్ని తెచ్చి పెడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో మరో రూ.25వేల కోట్లు వెచ్చిస్తే చెవేళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంతో పాటు 18లక్షల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని, కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ప్రాణహిత- చెవేళ్ల ప్రాజెక్టును వినియోగంలోకి తేవటం ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం చెవేళ్ల-ప్రాణహిత వైపే మొగ్గు చూపితే ఇప్పటికే నిర్మాణమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలుగానే మిగిలిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్ రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి : పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

మేడారంలో వైద్య అధికారులతో సమీక్ష ● వివిధ శాఖల సేవలకూ శ్రీకారం



ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 17 : మేడారం తరలొచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అదించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, వైద్యఅధికారులకు ఆదేశించారు. శనివారం మేడారం పర్యటనలో భాగంగా ఆమె హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా, మహాజాతర నోడల్ అధికారి, హెల్త్ డైరెక్టర్ ఆర్.వి కర్లన్, ఐటీడీఏ పీవో అంకిత్‌లతో కలిసి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. మేడారం మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా చోంగ్తు మాట్లాడుతూ జాతరలో ముఖ్యంగా వ్యాపారులు భక్తులకు విక్రయించే ఆహారంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు భక్తులకు తెలిసే విధంగా సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని, గద్దెల ప్రాంగణంలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో 24గంటల పాటు వైద్య సేవలు అందించాలని, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హెల్త్ డైరెక్టర్ ఆర్వీ కర్లన్ మాట్లాడుతూ 40జీవీకే అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని, రద్దీ ఎక్కువగా ఉండేప్రాంతాలలో నిరంతరం వైద్య సిబ్బంది ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంపన్నవాగు ప్రాంతంలో గజ ఈతగాళ్లను మోహరించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్యూలైన్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్యాధికారి అప్పయ్య,సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జగదీశ్, ఏటూర్‌నాగారం ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సురేష్, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బైక్ అంబులెన్సు సేవలు ప్రారంభం

మహాజాతరలో భక్తులకు అత్యవరస వైద్య సేవలు అందించేందుకు వీలుగా బైక్‌అంబులెన్స్‌లను మంత్రి సీతక్క, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు, హెల్త్ డైరెక్టర్ ఆర్వీ కర్లన్, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠిలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు. మేడారం భక్తులకు అత్యవసర వైద్యం కోసం 40బైక్ అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని, ఈబైక్ అంబులెన్సుల ద్వారా 21 వైద్య సేవలను అందించే వీలుందన్నారు.

మేడారం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. మేడారంలోని హరిత హోటల్‌లో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మల జాతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నా రు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు ఉన్నచోట అదనపు ప్లాస్టిక్ బకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి కొరత లేకుండాచూడాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో మరుగుదొడ్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నా రు. నిరంతరం విద్యుత్ అందిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ములుగు కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శబరీష్ అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులున్నారు.

మీడియాతో ఆత్మీయ సమ్మేళనం

మహాజాతర విజయవంతానికి సన్నద్ధం చేస్తున్న అధికారులు మీడియా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లీష్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె తొలుత సమాచారపౌరసంబంధాల శాఖ రూపొందించిన మేడారం పుస్తకాన్ని, మీడియా టీషర్టులను కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శబరీష్‌తో కలిసి ఆవిష్కరించారు. జాతర విజయవంతం చేయడంలో మీడియాకీలకపాత్ర పోషించాలని, సమ్మక్క సారలమ్మ మహా జాతరకీర్తి ప్రతిష్ఠలు ప్రపంచం నలుమూలాల తెలిసే వార్తలు ప్రసారం చేయాలని కోరారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, వసతులు, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి జాతరకొచ్చే భక్తుల కోసం రూట్‌మ్యాప్ వీడియోను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజా, ఏటూరునాగారం అదనపు ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, సమాచార శాఖ అదనపు డైరెక్టర్‌లక్ష్మణ్, జిల్లా పౌరసంబంధాల అధికారి రఫీక్, ఏపీఆర్‌వో వేణు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

6వేల ప్రత్యేక బస్సులు

అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేకంగా 6వేల బస్సులను నడపడానికి సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. శనివారం మేడారంలో తాత్కలిక ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ 55ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా టికెట్ కౌంటర్‌లు, విశ్రాంతి గదులు, సిబ్బంది వసతి ఏర్పాట్లు చేశామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జాతరకు వచ్చే మహిళా భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు ఈసారి అధికంగా వచ్చే అంచనాలు ఉన్నందున గతంలో కంటే ఎక్కువగా 6వేల బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజా, అదనపు ఎస్పీ సంకీర్త్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత, ప్రత్యేకాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్ల ప్రసాదం

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర సందర్భంగా అమ్మవార్ల జాతరకు వెళ్లలేని భక్తులు తమ కానుకలను, మొ క్కులను ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్లకు చెల్లిస్తే, ఆర్టీసీ కార్గో ద్వారా భక్తుల ఇం టికే ప్రసాదం అందించే ఏర్పాట్లు అధికారులు చేశారు. ఈనెల 21 నుంచి 25 వరకు దేవాదాయ శాఖతో ఆర్టీసీ కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రతీ బస్సుస్టేషన్ ప్రాంతంలో కార్గో కొరియర్ సేవలందించే కార్యాలయం వద్ద రూ. 300 అమ్మవార్లకు చెల్లిస్తే, భక్తుల ఇంటికి ప్రసాదాలు పసుపు, కుంకుమలు అందజేస్తారు. వివరాలకు 040-69440069 / 69440000 / 23450033 లకు సంప్రదించాలని కోరారు.

మేడారంలో చోరీ - రూ.11.42 లక్షల అపహరణ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 17 : మేడారంలో దొంగలు సంచరిస్తున్నారని, జంపన్నవాగు, తల్లుల గద్దెలు, ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట మార్గంలో ఇప్పటికే 16 చోరీలు జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఓ కొబ్బరికాయలు, బెల్లం వ్యాపారం నిర్వహించే షాపులో శుక్రవారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. రాత్రి సమయంలో నిర్వాహకులు షాపు మూసి వెళ్లిన తర్వాత షాపులోకి చొరబడ్డారు. షాపులో ఉన్న రూ. 11.42 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్టు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జంపన్నవాగు ప్రాంతంలో ఒక మహిళ మెడలో నుంచి 30 గ్రాముల పుస్తెల తాడు చోరీకి గురైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



మృతిచెందిన గోగుల కల్యాణ్

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

చిలుపూర్, ఫిబ్రవరి 17 : మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కోనాయగూడెం గ్రామానికి చెందిన గోగుల కల్యాణ్ (22) అనే యువకుడు బైక్‌పై కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిన్నపెండ్యాల సమీపంలో రాంగ్ రూట్‌లో వచ్చిన డీసీఎం వ్యాన్ యూటర్న్ చేసే క్రమంలో అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కల్యాణ్‌ను స్థానికులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి మహిళా రైతు దుర్మరణం



జయ (ఫైల్)

స్టేషన్ ఘన్ పూర్, ఫిబ్రవరి17: మండలంలోని చంద్రుతండాలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో అదే తండాకు చెందిన భూక్య జయ (35) అనే మహిళా రైతు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుతండా తాజామాజీ సర్పంచ్ భూక్యా రాజు వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై తన భార్య జయను పక్కనే కూర్చోబెట్టుకుని స్వయంగా డ్రైవింగ్ చేస్తూ బావి వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దేవాదుల గ్రావిటీ 2ఎల్ కెనాల్ సమీపానికి చేరుకోగానే ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ కింద ఇరుక్కుపోయిన జయ అక్కడిక్కడే మృతి చెందగా రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సై నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సైన్స్ టాలెంట్ టెస్ట్

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 17: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జనగామ మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్‌పీఎస్‌టీ), ఫోరమ్ ఆఫ్ బయో సైన్స్ టీచర్స్ (టీబీఎస్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో జనగామ ధర్మకంచ జడ్పీ పాఠశాలలో ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి బి.భూపతి అధ్యక్షత వహించగా మండల నోడల్ అధికారి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టాలెంట్ టెస్టులో పి.మోక్ష (జెడ్పీహెచ్ఎస్, ఓబుల్ కేశ్వాపురం) ప్రథమ స్థానం సాధించగా, జి.సుశీల్ (జెడ్పీహెచ్ఎస్, గానుగుపహాడ్) ద్వితీయ, ఏ.వీక్షిత (జెడ్పీహెచ్ఎస్, ధర్మకంచ) తృతీయ స్థానంలో నిలిచారు. వీరిలో మొదటి ఇద్దరు ఈ నెల 20న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఎస్‌టీ అధ్యక్షులు డి.గోపాలకృష్ణ, కె.రవీందర్‌రెడ్డి, బాలరాజు, కె.మారుతి ప్రసాద్, దామోదర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: విద్యార్థులో దాగిఉన్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలికితీసేందుకు కాంపెక్ల్ ప్రధానోపాధ్యాయుడు రామచంద్రం ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరు కాగా కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు లెంకపోతుల తనుషా మొదటి స్థానంలో నిలువగా, నకీర్త నిహారిక ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరు ఈ నెల 20న జిల్లా కేంద్రంలో నిర్వహించే సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బానోతు రవీందర్, అరుణజ్యోతి, తిప్పని శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

పాలకుర్తి, ఫిబ్రవరి 17 : సమగ్ర కులగణన చేపట్టాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినందున హర్షం వ్యక్తం చేస్తూ శనివారం రాజీవ్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు చిలువేరు కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణనకు తీర్మానం చేయడం బీసీలకు శుభసూచకమని అన్నారు. కార్యక్రమంలో సలేంద్ర వెంకన్న, ఐలేష్ యాదవ్, పోగు శ్రీనివాస్, కారుపోతుల శ్రీనివాస్, యాకసోమయ్య తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో కేక్ కట్ చేస్తున్న కడియం కావ్య



పాలకుర్తిలో కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



లింగాలఘణపురంలో..



జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(ఐ)లో..

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

జిల్లావ్యాప్తంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్న బీఆర్ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి17: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కడియం కావ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. తెలంగాణ సాధకుడిగా, తొలిముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో లింగాలఘణపురం ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డితో పాటుగా నియోజకవర్గ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకుర్తి: కేసీఆర్ జన్మదినం సందర్భంగా శనివారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. ప్రభుత్వ ఉన్నత శ్రేణి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పసునూరి నవీన్, ఎల్లయ్య, వీరమనేని యాకాంతరావు, బాలూనాయక్, దేవానాయక్, యాకయ్య, ఎడవెల్లి కృష్ణ, రాంబాబు, అశోక్‌రెడ్డి, గణేష్, పోశాల వెంకన్న, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: కేసీఆర్ జన్మదినం సందర్భంగా తమ్మడపల్లి(ఐ)లో ఎంపీపీ రడపాక సుదర్శన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాదె సుధాకర్‌బాబు, రడపాక రహమాన్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: కేసీఆర్ జన్మదినం సందర్భంగా లింగాలఘణపురంలో బీఆర్ఎస్ నాయకులు బొల్లంపల్లి నాగేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నవాబుపేట ఎంపీటీసీ తీగల సిద్దుగౌడ్, నాయకులు బూడిది రాజేశ్వర్, నవాబుపేట కోదండ రామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ తీగల శ్రీనివాస్‌గౌడ్, కొత్తకొండ గంగాధర్, కోతి రాజు, లింగమూర్తి, మాజీ ఎంపీటీసీ ఉప్పల మధు, మబ్బు కరుణాకర్ పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింధె రామోజి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.జ్యోతి, నాయకులు పేరం రాము, డి.వెంకటేశ్వర్‌రావు, పసునూరి మధుసూదన్, రాగ్యానాయక్, వెంకటనారాయణ, రమేష్, ప్రేమ్‌కుమార్, సతీష్, షన్ను, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: కేసీఆర్ జన్మదినం సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ కార్యాయలంలో పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లా సుందర్ రామ్‌రెడ్డి, బస్వ మల్లేశం, కొల్లూరు సోమయ్య, హనుమంతు, చింత రవి, రామ్‌సింగ్, కృష్ణమూర్తి, గండిపెల్లి యాకయ్య, గిరియాదవ్, సోమనర్సయ్య, తిరుమలేష్, తాటిపెల్లి మహేష్, యాదగిరి, రమేష్, జోగేశ్వర్, భరత్, యాదవరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలువేరు లింగం, జడ్పీటీసీ ముద్దసాని పద్మజ వెంకట్ రెడ్డి, ఎంపీపీ జొన్నగోని హరిత సుదర్శన్ గౌడ్, వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీల సంజీవ, ఎంపీటీసీలు అర్జుల మధుసూధన్ రెడ్డి, భూక్య జుంలాల్ నాయక్, తుపాకుల మంగ పాల్గొన్నారు.

నర్మెట: కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జడ్పీ కోఆప్షన్ ఎమ్డీ గౌస్, జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామిని శివరాజు, ప్రజ్ఞాపురం అంజయ్య, గుడికందుల నరహరి, ఇట్టబోయిన రమేష్, శశిరథ్, మల్లేష్, సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, బాలకృష్ణ, రవీందర్, ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కేసీఆర్ జన్మదిన వేడుకలను బచ్చన్నపేటలో ఘనంగా నిర్వహించారు. రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. రైతు సంక్షేమానికి కృషి చేసిన కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, ఎంపీటీసీ కర్నాల వేణు, బీఆర్ఎస్ నాయకులు బోడిగం చంద్రారెడ్డి, గంధమాల నరేందర్, ఈదుల కంటి ప్రతాప్‌రెడ్డి, గుర్రపు బాల్‌రాజు, అజీం, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ షబ్బీర్, జిల్లా సందీప్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్లలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



దేవరుప్పులలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



నర్మెటలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బచ్చన్నపేటలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

● కేయూ మాజీ వీసీ వంగాల గోపాల్‌రెడ్డి

దేవరుప్పుల, ఫిబ్రవరి 17: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యానభ్యసించిన వారు ఎంతో గొప్పస్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడ్డారని కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ వంగాల గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సింగరాజుపల్లి హైస్కూల్‌లో సొంత నిధులతో నిర్మించిన లైబ్రరీ, సైన్స్ లాబరేటరీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఇక్కడున్న వారంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారేనని, గొప్ప గొప్ప స్థాయిల్లో ఉన్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే విద్య మనిషి విలువను పెంచుతుందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న చందంగా పాఠశాలలో చదువుతున్న వారంతా గొప్ప వ్యక్తులుగా ఎదగాలన్నారు.

కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఘంటా రమేష్ మాట్లాడుతూ వేణు గోపాల్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం డబ్బులు వెచ్చించడం అభినందనీయమన్నారు. ఆయనది దాతృత్వ స్వభావమని కొనియాడారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో వనరులను ఉపయోగించి చేసే బోధన పిల్లల మంచి భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు.



సింగరాజుపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ వంగాల గోపాల్‌రెడ్డి

కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ సంతోష్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కలేజీ ప్రిన్సిపాల్ దయాకర్‌రెడ్డి, వరంగల్ డెఫోడిల్స్ స్కూల్ యజమాని మనోహర్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము, హెడ్మాస్టర్ కళావతి, ఉపాధ్యాయుడు దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌దాస్ మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ కొండా బుచ్చిరెడ్డి, చిన్న మల్లారెడ్డి, కొంగరి రాములు, ఎల్లప్ప, నిరంజనీ, ప్రవీణ, అనిల్‌కుమార్, లక్ష్మీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆరు కమిటీల బాధ్యత అధిష్ఠానం వద్దకు..

బచ్చన్నపేట, ఫిబ్రవరి 17: మండలంలోని 26 గ్రామాలలో ఇప్పటికే 20 గ్రామాల్లో పూర్తిస్థాయి కమిటీలు వేయగా, ఆరు గ్రామాల్లో పెండింగ్‌లో పడింది. గంగాపూర్, కొన్నె, ఆలీంపూర్, చిన్నరామన్‌చర్ల, వీఎస్ఆర్ నగర్, కట్కూరు గ్రామాలకు సంబంధించిన వివరాలు అధిష్టానం వెల్లడిస్తుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. కట్కూరు గ్రామకమిటీని ఏర్పాటు చేసినప్పటికీ తమ సమక్షంలో జరగలేదని, తాము గుర్తించటం లేదంటూ మండల సమన్వయ కమిటీ సభ్యులు తెలిపారు. వీఎస్ఆర్‌నగర్ కమిటీ తాము వేసి వివరాలు పంపిస్తామని తెలపటంతో విషయం అధిష్టానం దృష్టికి తీసుకెళుతున్నట్టు వివరించారు. గంగాపూర్, కొన్నె, ఆలీంపూర్, చిన్నరామన్‌చర్ల గ్రామాల్లో అధ్యక్ష స్థానానికి ఎన్నికలు మినహా, మిగతా కమిటీలు పూర్తి చేయటం జరిగిందన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నిర్ణయానుసారం ఆరు గ్రామాల కమిటీల ప్రకటన ఉంటుందని సమన్వయ కమిటీ నేతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 17 : మండలంలోని తమ్మడపల్లి(ఐ)లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్ఎంపీ రషీద్ కుటుంబానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఆర్థిక చేయూతనందించారు. మాజీ సర్పంచ్ గాదె అనిత సుధాకర్‌బాబు, ఎంపీపీ రడపాక సుదర్శన్‌తో పాటు గ్రామస్తులంతా కలిసి మొత్తం లక్ష రూపాయలను శనివారం రషీద్ కుటుంబీకులకు అందజేశారు.

నీటి సంపులో పడి అన్నాచెల్లెలు మృతి

(5వ పేజీ తరువాయి)

ఆరేళ్లక్రితం వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన కరనం రవితేజకు ఇచ్చి వివాహం చేశారు. వారికి శౌర్యతేజ (3), తేజస్విని (ఏడాదిన్నర) సంతానం ఉన్నారు. రవితేజ పౌరహిత్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో త్వరలో జరిగే మేడారం మహాజాతరకు వచ్చి సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవాలన్న యోచనలో శుక్రవారం సాయంత్రం రవితేజ తన కుటుంబంతో కలిసి వరగంల్ బాలాజీనగర్‌లోని అత్తవారింటికి వచ్చాడు. రాత్రి భోజనాలు అయ్యాక అందరూ నిద్రపోయారు. శౌర్యతేజ, తేజస్విని సెల్‌ఫోన్ చూసుకుంటూ ఉన్నారు. ఈక్రమంలో రాత్రి 11 గంటల తర్వాత వారిద్దరూ మూత్ర విసర్జన కోసం ఇంటి ఆవరణలో ఉన్న స్నానాల గదికి వెళ్లేందుకు బయటకు వచ్చారు. చీకటిగా ఉండటంతో మూతతీసి ఉన్న సంపులో పడిపోయారు. కొద్ది సేపటి తర్వాత చిన్నారుల అలికిడి లేకపోవడం, వారు మంచంపై కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు రవితేజ, బాలేశ్వరి, తాత శ్రీనివాస్, అమ్మమ్మ రమ బయటికి వచ్చి చుట్టుపక్కల వెతికారు. కానీ పిల్లలు ఇద్దరూ కనిపించకపోవడంతో అనుమానం వచ్చి సంపులో చూడగా శౌర్యతేజ, తేజస్విని నీటిలో కనిపించారు. వెంటనే వారిని బయటకు తీసి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒకేరోజు ఇద్దరు బిడ్డలను పోగొట్టుకున్న రవితేజ, బాలేశ్వరి దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

సెల్‌ఫోన్ ఇవ్వడమే కొంపముంచింది..

రాత్రి భోజనం తర్వాత పిల్లకు సెల్‌ఫోన్ ఇవ్వడమే తమకు శాపమైందని తండ్రి రవితేజ గుండెలవిసేలా రోదిస్తున్నాడు. 'మేం ప్రయాణం చేసి అలసి పోయి నిద్ర పోయాం. పిల్లలిద్దరూ సెల్ ఫోన్ చూసి పడుకుంటారని అనుకున్నాం. కానీ.. అంతలోనే ఇంత దారుణం జరుగుతుందని ఊహించలేకపోయాం.' అని విలపించాడు. 'అందరి తల్లిదండ్రులకు చేతులెత్తి మొక్కుతున్నాం. పిల్లలకు సెల్‌ఫోన్ చూడటం అలువాటు చేయవద్దు.. ప్లీజ్' అంటూ విలపించడం అక్కడివారిని కంటతడిపెట్టించింది.

సీపీఎం, ప్రజాసంఘాల విజయోత్సవ ర్యాలీ

బచ్చన్నపేట, ఫిబ్రవరి 17: బచ్చన్నపేట మండలం చిన్న రామన్‌చర్ల రెవెన్యూ శివారు గోపాల్‌నగర్ వద్ద గల 174 సర్వే నంబర్‌లోని భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వటాన్ని స్వాగతిస్తూ, శనివారం మండల కేంద్రంలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ కబ్జాకు గురైన సర్వేనంబర్ 174లోని 8-23 ఎకరాల భూమి కోసం రాజీలేని పోరు సాగించామన్నారు. సుదీర్ఘంగా చేసిన పోరాటానికి న్యాయం చేకూరిందన్నారు. ఆ భూమిని ప్రభుత్వం ఇళ్లు లేని పేదల కోసం పంచాలన్నారు. ఈ సందర్భంగా పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న వారితో పాటు, కేసులపాలైన వారిని సీపీఎం నేతలు సన్మానించారు. కార్యక్రమంలో భూసాధన కమిటీ కన్వీనర్ పర్వతం నర్సింహులు, సీపీఎం జిల్లా, మండల నేతలు రాపర్తి రాజు, బెల్లంకొండ వెంకటేశ్, ఇర్రి అహల్య, సుంచు విజేందర్, ప్రకాశ్, శేఖర్, వెంకటమల్లయ్య, రవీందరెడ్డి, ఎల్లయ్య, బలరాములు, అశోక్, శ్రీనివాస్, రాజు, మహేందర్, మనోహర్, వెంకటమ్మ, బాలరాజు, యాదగిరి, కర్ణాకర్, రాజవ్వ, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు

చిలుపూర్, ఫిబ్రవరి 17: చిలుపూర్-మబ్బుగుట్ట సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే మార్గంలో సొంత నిధులతో చేపట్టిన మట్టి రోడ్డు పనులను శనివారం ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే జాతరను వైభవంగా నిర్వహించేందుకు జాతర కమిటీ ప్రతినిధులతో పాటు, అధికారులు, కులసంఘాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్, జంగిటి లింగయ్య, నారగోని వెంకన్న, గనగోని రమేష్, తోట శ్రీనివాస్, శేఖర్, రాజయ్య, కలకోల రజినీకుమార్, కోటిలింగం, జంగం సంపత్, కిరన్, అశోక్, కుమార్, దండిగ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన రికార్డుల పరిశీలన

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 17: టెన్త్ విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలనకు గాను రెండో రోజు శనివారం మానిటరింగ్ బృందం కూనూరు, ఉప్పుగల్లు, తిమ్మంపేట జడ్పీ హైస్కూళ్లను సందర్శించింది. మంగు జయప్రకాశ్ నేతృత్వంలో సభ్యులు పెనుమాటి వెంకటేశ్వర్లు, కాసర్ల రమేశ్‌బాబు ముగ్గురు సభ్యుల బృందం విద్యార్థుల ఫార్మేటివ్ అసెస్‌మెంట్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరైన నోడల్ అధికారి పర్వేజ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి వార్షిక పరీక్షల్లో చక్కగా రాసి ఉత్తమ గ్రేడ్‌లను సాధించాలన్నారు. చదువు పట్ల ప్రతీ విద్యార్థి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.



కూనూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల రికార్డులను పరిశీలిస్తున్న మానిటరింగ్ బృందం

20న సేవాలాల్ జయంతి

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 17: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రం లో జరిగిన సన్నాహక సమావేశానికి వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వినోద్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం లోని ఎన్ ఎంఆర్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఉన్న గిరిజన ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు హాజరై లంబాడా జాతి ఔన్నత్యాన్ని కాపాడాలన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మణ్ నాయక్, వాంకుడోతు అనిత, దర్మబిక్షం, రవి నాయక్, భూక్య చందు నాయక్, ధరావత్ బిక్షపతి నాయక్, శంకర్ నాయక్, రమేష్ పాల్గొన్నారు.

రేపు ఎమ్మార్పీఎస్ సమావేశం

జనగామ టౌన్, ఫిబ్రవరి 17: ఎస్సీ వర్గీకరణ విషయంపై ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై చర్చించేందుకు సోమవారం భువనగిరి జిల్లాకేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్ మాదిగ తెలిపారు. శనివారం ఆయన జనగామలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ కార్యక్రమానికి జనగామ నియోజకవర్గ నాయకులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో చుంచు రాజు, నల్ల అంజయ్య, అల్వాల రాజు, అల్వల ప్రశాంత్, గడ్డం సోమరాజు, తేజ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేస్తున్న ఎస్ఐ

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 17 : జఫర్‌గఢ్ జడ్పీ హైస్కూల్‌లో శనివారం టెన్త్ విద్యార్థులకు ఎస్ఐ మహేందర్ పరీక్షా సామగ్రిని ఉచితంగా అందజేశారు. హెచ్ఎం గణేష్‌రెడ్డి, ఉపాధ్యాయుల సమక్షంలో ఆయన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఒత్తిడులకు లోను కావద్దన్నారు. చక్కగా చదువుకుని వార్షిక పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్లను సాధించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి, వేణుగోపాల్, శ్రీలత, సుష్మిత పాల్గొన్నారు.

దేవరుప్పుల: శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని మండలకేంద్రంలోని కస్తూర్బా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులకు శనివారం సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌చౌహాన్ పరీక్షా ప్యాడ్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలతో పాటు తల్లితండ్రులకు ఖ్యాతి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గుగులోతు శ్రీనివాస్, సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనగామ టౌన్: కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం జనగామలో బీఆర్ఎస్ నాయకుడు పంతులు ప్రభాకర్ చిన్నారులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘతన కేసీఆర్‌దేనని కొనియాడారు.

వైభవంగా బుగులు వెంకన్న వార కల్యాణం

చిలుపూర్, ఫిబ్రవరి 17 : చిలుపూర్‌గుట్ట దేవాలయంలో బుగులు వెంకటేశ్వరుని వార కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారి సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య వెంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ తంతును పూర్తి చేశారు. అనంతరం కల్యాణంలో కూర్చున్న కుటుంబాలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేసి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, స్వామివారి నిత్యసేవకులు, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు - కిరణ్మయి దంపతులు, కృష్ణమాచార్యులు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారి వార కల్యాణం జరిపిస్తున్న పూజారులు

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఐఈవో



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో శ్రీనివాస్

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 17: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో బైరి శ్రీనివాస్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రం లోని ధర్మకంచ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శేతి నందిని అధ్యక్షతన జరిగిన సెకండీయర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డెక్ సభ్యులు ఆంజనేయ రాజు, వేముల శేఖర్, కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గట్టు వెంకటేశ్వర్లు, అధ్యాపకులు వస్కుల శ్రీనివాస్, రామస్వామి, అఫ్జల్, రంగన్న, శ్రీకాంత్‌రెడ్డి, గణేష్, రజిత, ఇస్రత్ భాను, మరిపెల్లి రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ' హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి17: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను వెంటనే పునఃప్రారంభించాలని చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కన్వీనర్ సందీప్ మాట్లాడుతూ ఆదర్శ హాస్టల్ రెండేళ్లుగా మూతపడితే ఎమ్మెల్యేలకు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హాస్టల్‌ను ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సట్ల రాజు, గోనెల రాజు, నవీన్, వినయ్, గణేశ్, ప్రణయ్, హరీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

పాలకుర్తి, ఫిబ్రవరి 17 : వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి పిలుపునిచ్చారు. శనివారం వారు పాలకుర్తిలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పని చేసినట్లుగానే పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేయాలని కోరారు.



ఎస్సై చెన్నకేశవులును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దేవరుప్పుల ఎస్సైకి సన్మానం

దేవరుప్పుల, ఫిబ్రవరి 17: దేవరుప్పుల ఎస్సైగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నక్కల చెన్న కేశవులును శనివారం మండల బీఆర్ఎస్ శ్రేణులు షాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పోలీసులు ఫ్రెండ్లీగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అనంతోజు కృష్ణమూర్తి, గండిపెల్లి యాకయ్య, కన్నెబోయిన దేవరాజ్, నూకల భిక్షం, కన్నెబోయిన అయిలయ్య, తాళ్లపెల్లి నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఉప్పుల కుమార్, కొంగరి ఉమేష్, చింత నిఖిల్, అకుల సంతోష్, జిలుకర కిషన్, రవీందర్‌నాయక్, హరిచంద్ర, రాము తదితరులు ఎస్సైని సన్మానించారు.

ఎంపీడీవోకు వీడ్కోలు సమావేశం

జఫర్‌గఢ్: ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళుతున్న జఫర్‌గఢ్ ఎంపీడీవో శ్రీధర్‌స్వామికి శనివారం మండల పరిషత్ సమావేశ హాలులో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రడపాక సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ఇంచార్జీ ఎంపీడీవో సుమన్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీధర్‌స్వామిని ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.